క్లుప్తంగా

ఉమాచంద్రమౌళీశ్వరుడికి అభిషేకాలు



ఉమాచంద్రమౌళీశ్వర స్వామి

సింహాచలం : అడవివరంలోని విజినిగిరిపాలెంలో ఉన్న ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో సోమవారం స్వామికి విశేషంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భక్తులు, మహిళలు ఆలయానికి తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. బిల్వ పత్రాలతో స్వామికి అర్చన నిర్వహించారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్ కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

అప్పన్నకు వైభవంగా నిత్య కల్యాణం



తలంబ్రాల ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామికి సోమవారం నిత్యకల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ బేడా మండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను వేంజేపచేసి ఉదయం 9.30 గంటల నుంచి కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్ర బెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాల ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయ దాతలకు స్వామి వారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందజేశారు.

అప్పన్న అన్నప్రసాద పథకానికి రూ.లక్ష విరాళం



దాతకు బాండ్ అందజేస్తున్న సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి శాశ్వత అన్నప్రసాద పథకానికి సోమవారం నగరంలోని సీతమ్మధార ప్రాంతానికి చెందిన నరసాపురం మాధవరావు లక్ష 116 రూపాయలు విరాళం అందజేశారు. సంబంధిత విరాళాన్ని సింహగిరిపై పీఆర్‌వో కార్యాలయంలో నగదు రూపంలో అందజేశారు. దేవస్థానం తరపున దాతకు బాండ్‌ని ప్రోటోకాల్ సీనియర్ అసిస్టెంట్ సూర్యనారాయణ అందజేశారు. దేవస్థానం తరపున స్వామివారి దర్శనం కల్పించి ప్రసాదం, శేషవస్త్రం ఆలయ అధికారులు అందజేశారు.

పీఏసీఎస్ అధ్యక్షుడిగా దేముడు బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న దేముడు తదితరులు

సబ్బవరం: స్థానిక శ్రీదుర్గమాంబ ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు గండి దేముడు తెలిపారు. సోమవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్బవరం పీఏసీఎస్ జిల్లాలోనే ప్రథమ స్థానంలో ఉందన్నారు. గతంలో రెండు సార్లు డైరెక్టర్‌గా పని చేసిన అనుభవం ఉందన్నారు. తనపై విశ్వాసంతో ఈ పదవి అప్పగించడంతో మరింత అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. త్రిసభ్య కమిటీలో భాగంగా చైర్మన్ గండి దేముడితో పాటు డైరెక్టర్లుగా పల్ల తాతారావు, బొబ్బరి కన్నారావులచే సీఈవో గొంప రమణ ప్రమాణ స్వీకారం చేయించి బాధ్యతలు అప్పగించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే, ఏపీ ఆయిల్ ఫెడ్ చైర్మన్ గండి బాబ్జీ, మండల టీడీపీ అధ్యక్షుడు గండి ముత్యాలనాయుడు, బర్నికాన సాయినాథరావు, బొండా సత్యారావు, శాప్ చైర్మన్ పీబీవీఎస్ఎన్ రాజు, గండి వంశీదీప్, కొటాన అప్పారావు, రెడ్డి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

ఎంవీపీ కాలనీ : నగరంలోని మూడో పట్టణ పోలీసు స్టేషన్ పరిధిలోని రెల్లివీధికి చెందిన చెన్నా ప్రియ (36) అదృశ్యంపై పోలీసులు కేసు నమోదు చేశారు. రెల్లివీధిలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న ప్రియ నగరంలోని ఓ ప్రైవేట్ స్కూల్ టీచర్‌గా పని చేస్తోంది. రోజూ మాదిరిగానే గత నెల 29న విధులకు వెళ్లిన ప్రియ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు.

ఊపిరి పోసిన వాన

- పొలాల్లో ముమ్మరంగా వరినాట్లు
- నియోజకవర్గంలో సుమారు 5,500 ఎకరాల్లో వరిసాగుకు అంచనా
- తాజా వర్షాలతో పూర్తి స్థాయిలో పొలంబాట పట్టిన రైతాంగం



వరినారు తీస్తున్న కూలీలు



జలకళ సంతరించుకున్న చెరువు



వరినాట్లు వేస్తున్న కూలీలు



పెందుర్తి గ్రామీణ ప్రాంతంలో పూర్తయిన వరినాట్లు



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న దృశ్యం

పెందుర్తి : ముమ్మరంగా కురుస్తున్న వర్షాలు ఖరీఫ్ సీజన్‌కు ఊపిరి పోశాయి. గత మూడు రోజులుగా పడుతున్న వానలతో రైతాంగం పూర్తిస్థాయిలో పొలం బాట పట్టింది. నియోజకవర్గంలో పూర్తి స్థాయిలో వరిసాగు ప్రక్రియ మొదలైంది. పెందుర్తి గ్రామీణ ప్రాంతం, సబ్బవరం, పరవాడ మండలాల్లో ముమ్మరంగా వరినాట్లు వేస్తున్నారు. కాగా నియోజకవర్గంలో ఈ ఖరీఫ్ సీజన్‌లో సుమారు 5,500 ఎకరాల్లో వరి సాగు చేయనున్నట్లు యంత్రాంగం అంచనా వేస్తుంది.

ఖర్చు తగ్గించిన వరుణుడు

పది రోజుల క్రితం వరకు ఉన్న వాతావరణం చూస్తే ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌పై దాదాపుగా రైతులు ఆశలు వదులుకున్నారు. ఒకవేళ ఆఖర్లో వర్షాలు కురిసినా చెరువుల్లో నీటిని మోటార్ల ద్వారా పొలాల్లోకి తోడుకునే పరిస్థితికి రైతులు మానసికంగా సిద్ధమయ్యారు. అలా చేయాల్సి వస్తే అన్నదాతలపై ఆర్థిక భారం పెరిగేది. అయితే తాజాగా కుండపోత వర్షాలు కురవడంతో చెరువుల్లో నీటితో పనిలేకుండా దమ్ములు జరిగిపోతున్నాయి. ఈ క్రమంలో మోటార్లు, ఇంధనం ఖర్చు బాగా తగ్గిపోయిందని రైతులు ఊపిరి పీల్చుకున్నారు.

చెరువులకు జలకళ

సీజన్ ఆరంభంలో బీడు వారిన చెరువులు తాజా వర్షాలతో పూర్తిగా జలకళను సంతరించుకున్నాయి. రానున్న కొద్ది రోజులపాటు వ్యవసాయానికి తగినంత నీరు చెరువుల్లో చేరింది. ఎక్కడికక్కడ గెడ్డలు, వాగులు పొంగడంతో ప్రస్తుతానికి చెరువులన్నీ నిండు కుండలను తలపిస్తున్నాయి.

పెరిగిన పెట్టుబడి భారం

వరినాట్ల ప్రక్రియ గతంతో పోల్చితే ప్రస్తుతం భారంగానే మారింది. దమ్ము పట్టే ట్రాక్టర్ల నుంచి వరినాట్లు వేసే వ్యవసాయ కూలీల రోజువారీ కూలీ వరకు ధరలు భారీగా పెరిగిపోయాయి. దమ్ము పట్టే ట్రాక్టర్‌కు గంటకు రూ.1200 నుంచి రూ.1400 వరకు తీసుకుంటున్నారు. మహిళా వ్యవసాయ కూలీలకు రోజుకు రూ.450 నుంచి రూ.550 వరకు, పురుషులకు రూ.700 నుంచి రూ.800 వరకు తీసుకుంటున్నారు. కొన్నిచోట్ల ఎకరాలు/సెంట్లలో భూమిని అంచనా వేసి వరినారు తీసి నాట్లు వేసేందుకు కాంట్రాక్ట్‌లు తీసుకుంటున్నారు. ఎకరాకు రూ.4 వేలు నుంచి రూ.6 వేలు వరకు తీసుకుంటున్నారు.

రైతులకు అందుబాటులో ఉంటాం



తాజా వర్షాలతో రైతులు వరినాట్లు పూర్తిస్థాయిలో వేస్తున్నారు. ప్రస్తుతానికి పెందుర్తి మండలంలో ఈ రెండు మూడు రోజులకు 800 ఎకరాల్లో నాట్లు వేసినట్లు అంచనా. మొత్తంగా 1800 ఎకరాల్లో ఈ సీజన్‌లో వరి నాట్లు వేస్తారని అంచనా వేస్తున్నాం. సీజన్ మొత్తం రైతులకు అందుబాటులో ఉండి సస్య రక్షణ చర్యలపై అవగాహన కల్పించడంతోపాటు వారికి అవసరమైన సూచనలు అందిస్తాం. – చంద్రావతి, వ్యవసాయ శాఖ అధికారి, పెందుర్తి

కూడలి వద్ద నీటి నిల్వకు తాత్కాలిక ఉపశమనం



పెందుర్తి కూడలి వద్ద బీఆర్‌టీఎస్ డక్ట్‌లపై తొలగించిన పలకలు

సాక్షి ఎఫెక్ట్..

పెందుర్తి : పెందుర్తి నాలుగు రోడ్ల కూడలి వద్ద వర్షపు నీరు నిలిచిపోకుండా జీవీఎంసీ అధికారులు తాత్కాలిక చర్యలు చేపట్టారు. వర్షపు నీరు ప్రవహించకుండా అడ్డుగా ఉన్న బీఆర్‌టీఎస్ డక్ట్‌లు, కాలువపై ఉన్న పలకలను పూర్తిగా తొలగించారు. అందులో పేరుకుపోయిన చెత్త తీశారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా పెందుర్తి నాలుగు రోడ్ల కూడలిలో భారీగా వర్షపు నీరు నిలిచిపోయింది. దీంతో గత నాలుగైదు రోజులుగా స్థానిక ప్రజలు, వాహనదారులు రాకపోకలు సాగించేందుకు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. దీనిపై 'పెందుర్తి కూడలి.. కష్టాల కడలి' శీర్షికతో సాక్షిలో ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించి చర్యలు చేపట్టారు. నీరు సజావుగా ప్రవహించేందుకు చర్యలు తీసుకున్నారు. సోమవారం ఉదయం భారీ వర్షం కురిసినా కూడలి వద్ద నీరు నిలవకపోవడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

వృద్ధురాలి నేత్రాలు దానం చేసిన కుటుంబ సభ్యులు



అమ్మాజమ్మ నేత్రాలు దానం చేయడానికి అంగీకారం తెలుపుతున్న కుటుంబ సభ్యులు



మృతురాలు అమ్మాజమ్మ (ఫైల్)

పెందుర్తి: అనారోగ్యంతో మరణించిన ఓ వృద్ధురాలి నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. గోపాలపట్నం కొత్తపాలెం సమీపంలోని సాయినగర్‌కాలనీలో ఉంటున్న మరువాడ అమ్మాజమ్మ (75) అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. సమాచారం అందుకున్న పెందుర్తి సాయి హెల్పింగ్ హ్యాండ్స్ వ్యవస్థాపకుడు దాడి శ్రీనివాస్ ఆమె నేత్రాలను దానం చేయాల్సిందిగా కోరారు. దీనికి కుమారుడు మరువాడ శ్రీనివాస్, కుటుంబ సభ్యులు అంగీకారం తెలపడంతో మోషిన్ ఐ బ్యాంక్ ప్రతినిధి అజయ్ నేత్రాలను సేకరించారు.

లోతట్టు ప్రాంతాలు జలమయం



నిండు కుండలా కనిపిస్తున్న రాయపుర అగ్రహారంలోని సాగునీటి చెరువు

సబ్బవరం: మండలంలో తుపాను ప్రభావంతో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పలు సాగు నీటి చెరువులు నిండు కుండల్లా మారాయి. చెరువుల్లో పెద్ద ఎత్తున నీరు చేరింది. ఆదివారం కురిసిన భారీ వర్షానికి రోడ్లపై నుండి నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. సబ్బవరం–గుల్లేపల్లి రోడ్డులో ఆదిరెడ్డిపాలెం వద్ద కల్వర్టుపై నుండి పెద్ద ఎత్తున నీరు ప్రవహిస్తుండటంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. అదే విధంగా కోటపాడు–పినగాడి రోడ్డులో పినగాడి సమీపంలోని రోడ్డుపై నుండి భారీగా నీరు ప్రవహించడంతో కోటపాడు వైపు నుండి పినగాడి వైపు వచ్చే వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలగడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు.

నిరుపయోగంగా సచివాలయ భవనం



నిరుపయోగంగా ఉన్న పరవాడ గ్రామ సచివాలయ భవనం–1

పరవాడ: మండల కేంద్రమైన పరవాడలో లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు. ప్రజల సౌకర్యార్థం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రూ.35 లక్షల వ్యయంతో అన్ని మౌలిక సదుపాయాలతో కూడిన గ్రామ సచివాలయ భవనం–1 ఏడాది క్రితం గ్రామ పంచాయతీ కార్యాలయ సమీపంలో నిర్మించింది. భవన నిర్మాణాన్ని పూర్తి చేసి గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించారు. భవనాన్ని ప్రారంభించి ఏడాదిన్నర కావస్తున్నా నూతన గ్రామ సచివాలయంలో ప్రభుత్వ సేవలు నిర్వహించడం లేదు. నూతన గ్రామ సచివాలయ భవనం ఇరుగ్గా ఉండడంతో ప్రభుత్వ సేవల కోసం వచ్చే వారికి స్థలం సరిపోదన్న ఉద్దేశ్యంతో అధికారులు నూతన భవనంలోకి సచివాలయాన్ని మార్చేందుకు వెనుకడుగు వేస్తున్నారని తెలుస్తోంది. దీంతో కొత్త భవనం నిరుపయోగంగా పడి ఉంది. ప్రస్తుతం పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే సిబ్బంది సేవలు అందిస్తున్నారు. అధికారులు స్పందించి నూతన గ్రామ సచివాలయ భవనాన్ని ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.

మూడు ద్విచక్ర వాహనాల రికవరీ



రికవరీ చేసిన ద్విచక్ర వాహనాన్ని యజమానికి అప్పగిస్తున్న క్రైం ఎస్‌ఐ సూరిబాబు

పెందుర్తి: పెందుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలో చోరీకి గురైన మూడు ద్విచక్ర వాహనాలను క్రైం విభాగం పోలీసులు గంటల వ్యవధిలో రికవరీ చేశారు. వివరాలివి.. సోమవారం ఉదయం పురుషోత్తపురం సమీపంలో రెండు ద్విచక్ర వాహనాలు, గొర్లివారికాలనీలో ఓ స్కూటీ చోరీకి గురైనట్లు బాధితులు ఫిర్యాదు చేశారు. దీనిపై వెస్ట్ జోన్ క్రైం విభాగం సీఐ శ్రీనివాసరావు ఆదేశాల మేరకు వెంటనే స్పందించిన ఎస్‌ఐ డి.సూరిబాబు, సిబ్బంది కె.శ్రీనివాసరావు, వి.విజయ్‌కుమార్ రంగంలోకి దిగారు. సీసీ పుటేజీల ఆధారంగా ఆయా ద్విచక్ర వాహనాలను సాయంత్రానికి గుర్తించారు. వాటిని పెందుర్తి పోలీస్ స్టేషన్ వద్ద ఎస్‌ఐ సూరిబాబు చేతుల మీదుగా అందజేశారు.

వీధి కుక్కల దాడులతో బెంబేలెత్తిపోతున్న ప్రజలు



వెన్నలపాలెం రహదారిలో సంచరిస్తున్న వీధి కుక్కలు

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లో రోజురోజుకి పెరిగిపోతున్న వీధి కుక్కల బెడదతో ప్రజలు రోడ్ల మీదకు రావాలంటేనే భయపడుతున్నారు. మండల పరిధిలో వెన్నలపాలెం, పరవాడ, వాడచీపురుపల్లి, ముత్యాలమ్మపాలెం, నాయుడుపాలెం, తానాం, పెదముషిడివాడ, దేశపాత్రునిపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో సంచరిస్తున్న వీధి కుక్కలతో పల్లె ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల నాయుడుపాలెం గ్రామానికి చెందిన ఇద్దరిపై వీధి కుక్కలు దాడి చేసి తీవ్రంగా గాయపరిచాయి. వీటి దాడుల వల్ల పరవాడ, వాడచీపురుపల్లి పీహెచ్‌సీలకు వైద్యం కోసం వచ్చే క్షతగాత్రుల సంఖ్య పెరిగిపోతుందని ప్రభుత్వ వైద్యులు చెబుతున్నారు. వీధి కుక్కలు రోడ్లు, వీధుల్లో విచ్చల విడిగా సంచరించడం వల్ల మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు భయపడుతున్నారు. వీధి కుక్కలు ద్విచక్ర వాహన చోదకులను తరుముతూ దాడులకు పాల్పడుతున్నాయి. పరవాడ సంతబయలు, వెన్నలపాలెం కల్యాణమండపం, దీపాంజలినగర్ కూడళ్లలో వీధి కుక్కలు గుంపులుగా రోడ్లపై మకాం వేసి ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. ఈ సమస్య పరిష్కారానికి అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పల్లె ప్రజలు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌కు 5 వినతులు



వినతిని పరిశీలిస్తున్న జెడ్సీ హేమావతి

పెందుర్తి: వేపగుంట జీవీఎంసీ జోన్–8 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ సమస్యలపై 5 వినతులు అందాయి. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు జరిగిన కార్యక్రమంలో ప్రజల నుంచి జోనల్ కమిషనర్ కె. హేమావతి వినతులు స్వీకరించారు. ఆయా ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు జెడ్సీ ఆదేశాలు జారీ చేశారు. కార్యక్రమంలో జోన్–8 అన్ని శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేతాజీ ఆశయాలకు పునరంకితం కావాలి



నివాళులర్పిస్తున్న ఆచార్య షారోన్ రాజు తదితరులు

విశాఖ విద్య : స్వాతంత్ర్య సమరయోధుడు సుభాష్ చంద్రబోస్ 80వ వర్ధంతిని ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యా విభాగంలో సోమవారం నిర్వహించారు. ముందుగా సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి విభాగాధిపతి ఆచార్య షారోన్‌రాజు పూలమాలవేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత దేశ స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ ఒక ప్రత్యేకమైన స్థానాన్ని కలిగి ఉన్నారన్నారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను స్థాపించి భారతీయ యువతను స్వాతంత్ర్య ఉద్యమం దిశగా నడిపించిన విధానం స్ఫూర్తిదాయకమని కొనియాడారు. బ్రిటిష్ వారికి మన సత్తా చాటే విధంగా ఆయన దీనిని తీర్చిదిద్ది నిర్వహించారని గుర్తు చేశారు. విద్యార్థులు ఇటువంటి మహనీయులను, స్ఫూర్తిదాతలను ఆదర్శంగా తీసుకుని దేశం కోసం పాటుపడాలని సూచించారు. భవిష్యత్ ఉపాధ్యాయులుగా మారే మీరంతా చిన్నారుల్లో దేశ భక్తి నింపేందుకు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో విభాగ అధ్యాపకులు డాక్టర్ ప్రకాష్, డాక్టర్ ఆలీ, డాక్టర్ సాల్మన్, డాక్టర్ హరిబాబు, డాక్టర్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని వినతి

మహారాణిపేట: బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) జిల్లా అధ్యక్షుడు భీమరశెట్టి విశ్వనాథం కోరారు. సోమవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. బీఎస్పీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జోనల్ ఇన్‌చార్జి శివప్రసాదరావు, జిల్లా ఇన్‌చార్జిలు పెద్దాడ కనకమహాలక్ష్మి, ఎ.రామచంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ ఎ. ధనుంజయరావు, గాజువాక అధ్యక్షుడు నందికొల్ల అప్పారావు, ఇతర నాయకులు శంకరరావు, దేవరపల్లి శరత్, అన్నవరం తదితరులు పాల్గొన్నారు.

ఏయూతో ఐఐటీఎం ఎంవోయూ



వీసీ రాజశేఖర్ సమక్షంలో ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న ఏయూ రిజిస్ట్రార్ ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ సూర్యచంద్రరావు

విశాఖ సిటీ : ఆంధ్ర విశ్వవిద్యాలయంతో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటరాలజీ (ఐఐటీఎం) సంస్థ అవగాహన ఒప్పందం చేసుకుంది. సోమవారం ఏయూ పాలక మండలి సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ సమక్షంలో అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్. ధనుంజయరావు, ఐఐటీఎం డైరెక్టర్ డాక్టర్ ఎ.సూర్యచంద్రరావు సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ అంతర్జాతీయ ప్రాజెక్టులను సాధించి నిర్వహించే దిశగా రెండు సంస్థలు కృషి చేయాలని సూచించారు. పోస్ట్ డాక్టరల్ ఫెలోషిప్‌లను ఏర్పాటు చేయాలని చెప్పారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి ఎంవోయూ ప్రగతిని సమీక్షించాలన్నారు. ఐఐటీఎం డైరెక్టర్ సూర్యచంద్రరావు మాట్లాడుతూ ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఒక ప్రత్యేకమైన వాతావరణ అధ్యయన కేంద్రాన్ని ఏర్పాటు చేసే ప్రతిపాదన ఉందన్నారు. వాతావరణ అంచనాలను సిద్ధం చేసి తగిన సూచనలు ఇచ్చే విధంగా ఈ కేంద్రం పనిచేయాలని చెప్పారు. దేశీయ టెక్నాలజీని అభివృద్ధి చేసి సెన్సార్ల నుంచి పరికరాల వరకు దేశీయ సాంకేతిక ఉపకరణాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఇక్కడ చదువుకునే విద్యార్థులకు అవసరమైన నైపుణ్యాలను పెంపొందించే దిశగా కృషి జరుగుతోందన్నారు. నగర స్థాయిలో వాతావరణ అంచనాలను అందించడంపై చేపడుతున్న చర్యలను వివరించారు. ఏయూ వాతావరణ అధ్యయన విభాగాధిపతి ఆచార్య పి.సునీత మాట్లాడుతూ పరిశోధనలో సంయుక్త కార్యాచరణ, ఐఐటీఎంకు సంబంధించిన పరిశోధనలకు సమాచార మార్పిడి, విద్యార్థులకు శిక్షణ, వర్క్‌షాప్‌ల నిర్వహణ, ఇంటర్న్‌షిప్‌లు, ఫ్యాకల్టీ కొలాబరేషన్ వంటివి నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య ఎస్.కిశోర్ బాబు, ప్రిన్సిపాల్ ఆచార్య ఎం.వి.ఆర్.రాజు, జి.శశిభూషణరావు, ఐఐటీఎం శాస్త్రవేత్తలు డి.పద్మకుమారి, సచిన్‌దేశ్‌పాండే, శుభ్రత్ కుమార్ దాస్, విభాగాధిపతులు, ఆచార్యులు, డీన్‌లు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి విశేష పూజలు

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో నిర్వహిస్తున్న శ్రీలక్ష్మి పూజలు సోమవారం 25వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల మధ్య శ్రీలక్ష్మి పూజలు ప్రారంభించారు. ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. మరిన్ని వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవో కె.రాజేంద్రకుమార్, సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు అష్టదళ పద్మారాధన..

కనకమహాలక్ష్మి అమ్మవారికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించనున్న ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి.

విద్యార్థుల గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్

- అటువంటి దుశ్చర్యలకు దూరంగా ఉండాలి
- నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి
- ఐఐఎంవీలో ముగిసిన యాంటీ ర్యాగింగ్ వారోత్సవాలు



ర్యాగింగ్ అనర్థాలపై పోస్టర్ విడుదల చేస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి తదితరులు

తగరపువలస: విద్యార్థుల భద్రతను, గౌరవాన్ని దెబ్బతీసే నేరం ర్యాగింగ్ అని పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. భవిష్యత్తును అంధకారంలోకి నెట్టే అటువంటి దుశ్చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో సోమవారం నిర్వహించిన ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ర్యాగింగ్‌కు సంబంధించి చట్టపరమైన నిబంధనల గురించి తెలియజేశారు. విద్యార్థులు యూజీసీ, ఐఐఎం సంస్థాగత నిబంధనలను పాటించాలని సూచించారు. ర్యాగింగ్ వ్యతిరేక చర్యలపై విద్యార్థులు, తల్లిదండ్రులు, మీడియా, పౌర సమాజం, పోలీసు అధికారుల పాత్రను యాంటీ ర్యాగింగ్ కమిటీ చైర్మన్, డీన్ సూరిశెట్టి విజయభాస్కర్ తెలియజేశారు. పరిపాలన డీన్ ప్రొఫెసర్ కావేరి కృష్ణన్ మాట్లాడుతూ క్యాంపస్‌లో నిఘా, నివారణ చర్యలు, యాంటీ ర్యాగింగ్ కమిటీ, యాంటీ ర్యాగింగ్ స్క్వాడ్ పాత్ర గురించి వివరించారు. వారం రోజుల పాటు విద్యార్థులకు యాంటీ ర్యాగింగ్‌పై నిర్వహించిన వివిధ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందించారు. అనంతరం ర్యాగింగ్ వ్యతిరేక పోస్టర్‌ను ఆవిష్కరించారు.

- సంగివలస అనిల్ నీరుకొండ మెడికల్ కళాశాలలో యాంటీ ర్యాగింగ్ వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో సీపీ శంఖబ్రత బాగ్చి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో డీన్ డాక్టర్ పీవీ సుధాకర్, సీఈవో చంద్రశేఖర్‌రెడ్డి, ఏవో శివప్రసాద్, మధురవాడ జోన్ ఏసీపీ అప్పలరాజు, భీమిలి సీఐ తిరుమలరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.